## క్లుప్తంగా

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని శ్రుతిని అభినందిస్తున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: మండలంలోని ఆరెకల్లు గ్రామంలోని మహాత్మగాంధీ జ్యోతిరావు పూలే (బీసీ) గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.శృతి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం యమునాదేవి తెలిపారు. శనివారం పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఇంటర్ సెకండియర్ విద్యార్థిని ఎస్.శృతి 3వేల మీటర్ల రేస్ వాక్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిందని చెప్పారు. అలాగే ఫస్టియర్ విద్యార్థిని జె.శ్రావణి 100 మీటర్ల రేస్‌వాక్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిందని, హరిప్రియ, సంధ్య, భావని, అనూష, స్వప్న రాష్ట్రస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో తమ ప్రతిభ చాటారని వివరించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఎస్.శృతి తరపున ప్రాతినిథ్యం వహిస్తుందని పేర్కొన్నారు.

### జీజీహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన ఎం.శ్రీనివాసనాయక్

ఆదోనిటౌన్: స్థానిక సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.శ్రీనివాసనాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కడప రిమ్స్ ప్రభుత్వ వైద్యశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, సిబ్బందితో సమావేశమయ్యారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని ఆయన సూచించారు. రోగుల పట్ల మర్యాదగా నడుచుకుంటూ సకాలంలో సేవలందించి ఆసుపత్రికి మంచిపేరు తేవాలని కోరారు.

### పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆదోనిఅర్బన్: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులకు ఆదోని డాక్టర్లు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు శనివారం పౌష్టికాహార కిట్లను శనివారం అందజేశారు. 34 మందికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అలాగే విరాళాలు అందించిన వారికి భారత ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, ఈసీ మెంబర్‌లు వనపరాజు, డాక్టర్ ఉషారావు, విద్య, టీబీ ఆఫీసర్ డాక్టర్ షేకు న్‌బాను, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

### సీనియర్ రెసిడెంట్‌లకు కౌన్సెలింగ్



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వాణిశ్రీ

ఆదోనిటౌన్: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ల నియామకాల కోసం శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి నూతన భవనంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌లు రవికుమార్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వాణిశ్రీ కౌన్సెలింగ్ చేపట్టారు. 57 పోస్టుల నియామకం కోసం వివిధ శాఖల నుంచి వచ్చిన అప్లికేషన్‌లను, ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. మెరిట్ లిస్ట్, ప్రిపరేషన్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ రెసిడెంట్ల రిక్రూట్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

మంత్రాలయం : కనీస వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం కొనసాగాయి. సీఐటీయూ మండల కార్యదర్శి జయరాజు, ప్రాజెక్టు అధ్యక్షురాలు విశాలాక్షి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని కోరారు. సంఘం నాయకులు ఫాతిమా, భీమేశ్వరి, ఉమామహేశ్వరి, సీఐటీయూ నాయకుడు ఆంధ్రయ్య, కేవీపీఎస్ నాయకులు అనిల్, ధర్మ, అంజి పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలనీ బీసీ యువజన పార్టీ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు నరేంద్ర యాదవ్, హరీష్, అక్బర్, హరి కోరారు. శనివారం వారి సమ్మెకు మద్దతు తెలిపారు.

### ధనుర్మాస పూజలు ప్రారంభం

ఆదోనిఅర్బన్: రణమండల కొండలో వెలసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవ సమితి సభ్యులు స్వామి వారికి వేకువజామునే ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, సింధూరసేవ, తులసీ, పూలహారం అలంకారం తదితర పూజలు జరిపించారు.

# ‘వన’ విహారానికి అడుగులు

- ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు సేదతీరేలా నగరవనం
- రూ.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 39.40 హెక్టార్ల కేటాయింపు
- ప్రహరీ నిర్మాణం, కంప చెట్ల తొలగింపు పనులు ప్రారంభం
- ఆదోని, ఎమ్మిగనూరు వాసులకు ఉపయోగకరం
- ఇప్పటికే కర్నూలు, డోన్‌లో అందుబాటులోకి

పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణంలో పలు పార్కులున్నప్పటికీ మరింత మెరుగైన, కుటుంబంతో సేదతీరేలా నగర వనం నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నగర వన యోజన పథకం కింద రూ.2కోట్లు కేటాయించింది. ఇప్పటికే కర్నూలు, డోన్‌లో నగర వనాలను అందుబాటులోకి తీసుకురాగా.. ఆదోని సమీపంలోని కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని 39.40 హెక్టార్లలో నగర వనం ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కంప చెట్ల తొలగింపు, ప్రహరీ నిర్మాణ పనులు మొదలయ్యాయి.





ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజలు చేస్తున్న ఫారెస్ట్ అధికారులు (ఫైల్), కోటేకల్ రిజర్వ్ ఫారెస్టులో కంప చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: ఆహ్లాదకరమైన.. పచ్చని వాతావరణంలో ప్రజలు సేదతీరేలా నగర వనాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నగర పట్టణ వాసులు సేదతీరేలా నగర వనాల ఏర్పాటు చేస్తుంది. ఇప్పటికే కర్నూలు, డోన్ పురపాలక పరిధిలోని నగర వనాలను సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆదోని పరిధిలోని కోటేకల్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని 39.40 హెక్టార్లలో నగర వనం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు నగర వన యోజన పథకం కింద రూ. 2 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ప్రహరీ నిర్మాణ పనులు, కంప చెట్ల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. అటవీ శాఖ అధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో కోటేకల్లు గ్రామ సమీపంలో నగరవనం వెలియనుంది. పనులు పూర్తయితే ఆదోని, ఎమ్మిగనూరు పట్టణ ప్రాంతాల ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరేందుకు అవకాశం లభిస్తుంది.

**సౌకర్యాలు ఇలా..**

ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు సేద తీరడానికి అనువైన ప్రదేశాలు లేవు. పట్టణంలో చిన్న చిన్న పార్కులు ఉన్నప్పటికీ కుటుంబంతో వెళ్లి కాలక్షేపం చేయడానికి అనుకూలంగా లేవు. మారుతున్న కాలనుగుణంగా చాలా మంది సెలవు దినాల్లో, విడిది రోజుల్లో పిల్లాపాపలతో కలసి వన విహారం చేయడానికి ఇష్టపడుతారు. అలాంటి అనుకూలమైన ప్రాంతాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. కోటేకల్ వద్ద ఏర్పాటవుతున్న నగర వనం ఆదోని, ఎమ్మిగనూరు పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నగర వనంలో ప్రధాన ద్వారం అర్చ్, పార్క్, వాకింగ్ ట్రాక్, బైస్కిల్ ట్రాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఈఈసీ), చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్, ల్యాండ్ స్కేపింగ్, చైన్ లింక్ ఫెన్సింగ్, ప్రత్యేక పార్కింగ్ వంటి పనులను చేపట్టనున్నారు. వీటితో పాటు పిల్లలు ఆడుకోవడానికి అనువైన పరికరాలతో కూడిన ఆట స్థలం కూడా ఏర్పాటు చేయనున్నారు.

**నగర వనం ఏర్పాటుకు చర్యలు**



కోటేకల్లు గ్రామం వద్ద నగర వనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఫారెస్ట్ పరిధిలో ఉన్న స్థలంలో నగర వనం అభివృద్ధి పనుల కోసం నగర వన యోజన పథకం కింద ప్రభుత్వం రూ. 2 కోట్లు కేటాయించింది. వీటితో ప్రజలకు అహ్లాదకరమైన వాతవరణం కల్పించేలా పనులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రస్తుతం కంప చెట్లు తొలగించే పనులు చేపడుతున్నాం. త్వరలో ఫౌండేషన్ స్టోన్ వేసి పనులు వేగవంతం చేస్తాం.

– తేజశ్విని, ఫారెస్ట్ రేంజ్ అధికారి

### త్వరలో అభివృద్ధి పనులు పూర్తి



గుడికంబాలిలో పనులను పరిశీలిస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ త్వరగా పూర్తి చేస్తామని మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చొరవతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. గుడికంబాలి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మాజీ సర్పంచ్ ఖాజా వీధిలో సిమెంటు రోడ్డు వేస్తామని, లింగాలదిన్నె గ్రామంలో విద్యుత్ తీగలు ఎత్తు పెంచేందుకు ఇప్పటికే స్తంభాలు ఏర్పాటు చేశామని ఆ పనులను రెండు రోజుల్లో పూర్తి చేసేల చర్యలు చేపట్టినట్లు వివరించారు. వెంకన్నగౌడ్, లక్ష్మి, మాజీ సర్పంచ్ గోపాల్ ఉన్నారు.

### మాధవరంలో సెక్షన్ 30 అమలు

మంత్రాలయం : మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉందని ఎస్‌ఐ కిరణ్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చట్ట ప్రకారం గ్రామాల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు చేసుకోవాలంటే ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే నిర్వాహకులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ప్రజల మదిలో జగనన్నకు సుస్థిర స్థానం



బసాపురంలో సంక్షేమ పథకాల కరపత్రాన్ని వృద్ధురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రతిపక్షాల ఆటలు సాగవు
- మళ్లీ ఆయనే సీఎం
- ఇప్పటికే ప్రజలకు నిర్ణయించేసుకున్నారు
- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: సంక్షేమ పథకాల వర్తింపు, అభివృద్ధి, పారదర్శక పాలన, హామీల అమలు తదితర వాటితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆయననే సీఎంగా గెలిపించుకోవాలని జనం నిర్ణయం తీసేసుకున్నారని, అయినా ప్రతిపక్షాలు తమ ప్రభుత్వం పసలేని ఆరోపణలు చేస్తున్నాయని, వారి ఆటలను జనం సాగనివ్వరని, ఈ సారి వారికి గతంలో వచ్చిన స్థానాలు దక్కే అవకాశం లేదని చెప్పారు. శనివారం మండలంలోని బసాపురం, కొండాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరిగి గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని, నవరత్నాలు అందుతున్నాయా లేదా, ఎంత మేర లబ్ధి చేకూరిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ హయాంలో పథకాల అమలు, ప్రస్తుతం జగనన్న పాలనలో అమలు ఎలా ఉందని ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతే వివిధ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ.3 లక్షలు వరకు లబ్ధి చేకూరిందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో పేదలను హౌసిగ్ బిల్లుల కోసం డబ్బులు తీసుకుని మోసం చేశారని గుర్తు చేశారు. పసుపు, కుంకుమ పేరుతో, మరుగుదొడ్ల బిల్లులు, నీరు–చెట్టు పథకం కింద టీడీపీ నాయకులు ప్రజల సొమ్మును జేబుల్లో వేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అలాంటి వాటికి అవకాశం లేకుండా కేవలం అర్హత ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమయ్యేలా జగనన్న చర్యలు చేపట్టారని వివరించారు. బసాపురం గ్రామంలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో రూ.48 లక్షలతో తరగతి అదనపు గదుల నిర్మిస్తున్నారని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు పైపులైన్ వేయాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచ్ ఈరమ్మవీరేష్, ఎంపీటీసీ శశిధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, నాయకులు డీఎం మనోజ్‌రెడ్డి, సీతారామరెడ్డి, సురేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, తిరుమలరెడ్డి, గాదిలింగారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, వాల్మీకి శేఖన్న, రామలింగేశ్వరయాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్, లింగప్ప, కల్పవల్లి, మల్లిక, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా సంక్షేమ బావుటా



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



చిన్నారి సాదిక్‌కు గోరుముద్ద తినిపిస్తున్న ఎమ్మెల్యే

మంత్రాలయం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురవేసిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే అజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉద్ఘాటించారు. నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టి ప్రతి వర్గం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చేశారన్నారు. అమ్మ ఒడి, మన బడి–నాడునేడు, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, జగనన్న విద్యా దీవెన తదితర పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచారని కొనియాడారు. గ్రామంలో ప్రధాన రోడ్డును సీసీ రోడ్డుగా మార్చుతామని, ప్రతి కాలనీకి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యా బోధనపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వస్తున్నాయని, మెనూ ప్రకారం వంటలు చేయాలని ఏజెన్సీ సభ్యులను హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, ఉరుకుంద ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు విజేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాం, సర్పంచులు రామాంజనేయులు, చంద్రశేఖర్, నాయకులు గజేంద్ర రెడ్డి, పూజారి ఈరన్న, పరమేష్, దేవదానం, ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ వీరేంద్రగౌడ్, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, ఎస్‌ఐ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో సాదిక్ అనే విద్యార్థిని తోటి విద్యార్థినితో గొడవ పడి ముభావంగా ఒక్కతే భోజనానికి కూర్చుంది. అదే సమయంలో ఎమ్మెల్యే సాదిక్ దగ్గరకు వెళ్లి బుజ్జగిస్తూ ''మీ జగన్ మామయ్య గోరుముద్ద ఇదిగో అమ్ములు.. అంటూ అన్నం తినిపించారు.

### ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



పురవీధుల్లో రథోత్సవం జరుగుతున్న దృశ్యం

ఆదోనిఅర్బన్:పట్టణంలోని క్రాంతినగర్‌లో వెలిసిన ఆంజనేయస్వామి 44వ రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీమత్ ఆంజనేయస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామివారి పల్లకీసేవ, రథోత్సవం చేపట్టారు. రథంపై ఉత్సవ మూర్తిని ఆశీనులు గావించగా డోలు, సన్నాయిల మధ్య కలశాలతో చిన్నారులు, మహిళలు ముందు నడవగా పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, వీరేష్, రామాంజనేయులు, ఉరుకుంద పాల్గొన్నారు.

**వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు..**

కౌతాళం: మండలలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోని అగసలదిన్నెలో, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి తెల్లవారు జామున అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.


## అర్హులందరికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అమరేష్

కౌతాళం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన భాద్యత అధికారులపై ఉందని ఎంపీపీ అమరేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారాజు ఆధ్వర్యంలో, ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల వ్యవసాయాధికారి శేషాద్రి మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకం కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవడానికి జనవరి 15వరకు ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడంతో ఇన్‌పుట్ సబ్సిడీ కింద మండలంలో 17,822 మంది రైతులు లబ్ధిపొందే అవకాశం ఉందని, వీరికి రూ.27.56కోట్లు రైతుల ఖాతల్లో జమవుతాయని చెప్పారు. ఎంఈఓ–2 శోభరాణి మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ సర్దుబాటు చేసి ఆయా పాఠశాలలకు డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించామన్నారు. నాడు–నేడు మొదటి విడత కింద 32పాఠశాలల్లో నాడు–నేడు కింద పనులు జరుగగా ఈ ఏదాది ఆ పాఠశాలల్లో చిన్న పాటి మరమ్మతులకు సంబంధించిన పనులు చేసుకోవడానికి రూ.36.35లక్షలు వచ్చాయని తెలిపారు. రెండవ విడత కింద 15 పాఠశాలలకు 52 ప్యానల్స్ వచ్చాయన్నారు. ఏపీఓ జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. వైద్యాధికారి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ రూ. 25లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచారన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య శ్రీ కార్డుల్ని మార్చి ఇవాలన్నారు. వైస్ ఎంపీపీలు బుజ్జిస్వామి, లిఖిత, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్ సాబ్, ఎంఈఓ–1 వరప్రసాద్ పాల్గొన్నారు.

### నాణ్యమైన పరికరాలను వాడండి



మాట్లాడుతున్న డీఈఈ సుధాకర్ కుమార్

ఆదోనిఅర్బన్: విద్యుత్‌ను ఆదా చేయడానికి ఐఎస్ఐ మార్క్ గల ఎలక్ట్రికల్ వస్తువులను ఇళ్లకు, ఫ్యాక్టరీలకు వాడాలని విద్యుత్ శాఖ డీఈ సుధాకర్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు ఉన్న ఫ్యాన్‌లు, విద్యుత్ పరికరాలను వాడాలన్నారు. ఎల్‌ఈడీ బల్బులను వాడి విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చన్నారు.

## ఘనంగా కార్తీక పూజోత్సవాలు



ఉచ్ఛయాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



అగసనూరులో ప్రభోత్సవం

కోసిగి: ఐరన్‌గల్లు, పెద్దభూంపల్లి, చిన్నభూంపల్లి, అగసనూరు గ్రామాల్లో శనివారం కార్తీక పూజోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐరన్‌గల్లు, పెద్ద భూంపల్లి, అగసనూరు గ్రామాల్లో శ్రీ ఆంజనేయ స్వామి, చిన్న భూంపల్లిలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి వేకువ జామున నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంకాలం ఉత్సవమూర్తులను ప్రభపై ఊరేగించారు. పెద్ద భూంపల్లిలో పి. మురళీ మోహన్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

మంత్రాలయం : ఖగ్గల్ గ్రామంలో జాతర వైభవంగా జరిగింది. శనివారం కార్తీకమాసాన్ని పురష్కరించుకుని జాతర వేడుక చేసుకున్నారు. ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని ఉచ్ఛయంపై ఊరేగించారు.

## మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన మహిళ





హరితను సన్మానిస్తున్న దృశ్యం, విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: వెటరన్స్ స్పోర్ట్స్ మీట్‌లో పి.హరిత ప్రతిభ చాటిందని మిల్టన్ పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌బాబు, కాపు బలిజ సంఘం అధ్యక్షుడు రంగస్వామి తెలిపారు. మిల్టన్ గ్రామర్ పాఠశాల అవరణలో కాపు, బలిజ సంఘం అధ్వర్యంలో శనివారం ఆమెను సన్మానించారు. వారు మాట్లాడుతూ ఈ నెల తిరుపతిలో జరిగిన స్పోర్ట్స్ మీట్ 200 మీటర్ల పరుగు పందెం విభాగంలో గోల్డ్ మెడల్, 5 కి.మీ. విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిందని చెప్పారు.

ఆదోనిరూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని మండలంలోని దొడ్డనకేరి పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటస్వామి తెలిపారు. శనివారం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు నరసారావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో కె.శివజ్యోత్స్న, కె.నవేశ్వరి, జి.శైలజ, కె.శివశంకర్, బి.జి.వినోద్, సి.నీలకంఠ, ఈ.శైలజ పాల్గొన్నారన్నారు. ఆరేకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి రాజు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించాడని హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడన్నారు.

### ఆర్‌ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో పనిచేసే ఆర్‌ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డాక్టర్ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌ఎంపీలకు వైద్యంపై అవగా హన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ చేయడం కానీ, ప్రవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం కానీ చేయకూడదన్నారు. బాలింతలకు, 5 ఏళ్లలోపు పిల్లలకు యాంటిబయాటిక్స్, స్టెయిరాయిడ్స్ ఎక్కువగా ఇవ్వకూడదన్నారు. ఆర్‌ఎంపీలు చిన్న చిన్న జబ్బులకు మాత్రమే ప్రాథమిక చికిత్స చేయాలన్నారు. ఎవరైనా పరిధి దాటి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే గాకుండా ప్రాక్టీస్‌ను రద్దు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఏంఈఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### వరిగడ్డి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

హొళగుంద: స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద శనివారం వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ఉన్న వారు అప్రమత్తం కావడంతో ప్రాణాపాయం తప్పింది. ఎల్లార్తి గ్రామానికి చెందిన రైతులు కర్ణాటక రాష్ట్రం దేవినగర్ నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టరులో గ్రామానికి తీసుకొస్తున్నారు. గడ్డి ఎక్కువగా ఉండడంతో వాల్మీకి సర్కిల్ వద్ద ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. కొద్ది సేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.